
కథ

# పల్లె పిలిచింది

మల్లాది రవిశంకర్



పూర్తిగా క్రిందికి దిగకుండానే దుమ్ము రేపుకుంటూ బస్ ముందుకి సాగిపోయింది. రోడ్డుకి అటువైపు మెలికలు తిరిగి కనిపిస్తున్న డొంక రోడ్డు...

దాదాపు ఇరవై సంవత్సరాల తర్వాత అడుగుపెట్టినా, ఏదో తెలిసిన పరిచయం లాంటి లాలింత. మా అమ్మ తిరిగిన నేల అనే ఫీలింగ్ చాలా ప్లెజెంట్‌గా అనిపించింది. రోడ్డుకి ఇరువైపులా పచ్చని పంట పొలాలు. వాటి పక్క నుంచి వేగంగా పరుగులు పెడుతున్న పంటకాలువ. తెలిసిన నేస్తాలలాగా ఆకాశాన్ని అంటుతున్నట్టు తాటిచెట్లు. అక్కడక్కడా అంత పరిచయం లేని మొహాల్లాగా అంకుశాల్లాంటి ఈతచెట్లు.. బ్యాగ్ భుజాన తగిలించుకొని ఊళ్లోకి నడవడం మొదలుపెట్టాను.

దూరంగా పొలం పనులు చేసుకుంటున్న కర్షకధీరులు. రంగు రంగుల చీరలతో ఈ దేశానికి వన్నెలం మేమే అన్నట్టుగా.

నల్లని మట్టి, పచ్చని పంట పొలాలు, నీలాకాశం, ఎగిరే పక్షులూ, చల్లని గాలీ.. దేశానికి వెన్నెముక లాంటి పల్లె.

కొంచెం దూరం నడవగానే ఒక పెద్దాయన ఎదురొచ్చారు. ఆగమన్నట్టు సైగ చేస్తూ. ఆయన నల్లగా, చాలా ఎత్తుగా ఉన్నారు. చేతిలో కర్ర నీరగాయ పంచె, పెద్ద పొట్ట, నోట్లో పొగగొట్టంలాగా లంక పొగాకు చుట్ట.

కళ్లపైన చేతులు పెట్టుకొని... గుర్తుపట్టటానికి ప్రయత్నిస్తూ...

"ఏ ఊరు బాబూ తమది?" అని కొంచెం సాగదీస్తూ. ఆ ప్రశ్నలో పల్లెటూరి మర్యాద కొట్టొచ్చినట్టుగా ఉంది.

ఢిల్లీ అని చెప్పాను.

"అబ్బో! దేశరాజధానీ నగరం అన్నమాట. అదే అనుకున్నాను. ఎవరి తాలూకేమిటి?" ఇంకో ప్రశ్న.

"భారతిగారి అబ్బాయిని" అని అమ్మపేరు చెప్పాను. ఇరవై సంవత్సరాల క్రితం ఈ మట్టిలోనే కలిసిపోయిన అమ్మ ఈయనకి తెలుసా? అనే అనుమానం.

"ఏ భారతి బాబూ? భాగవతుల భారతి కాదు కదా?"

అవునన్నట్టు తలూపాను.

"మా ఊరి ఆడపడుచేనయ్యా. ఆమె చిన్నవయసులోనే ఈ లోకం నుండీ వెళ్లిపోయింది. ఎంత మంచి పిల్లయ్యా మీ అమ్మ" ఆయన కనుకొలకల్లో కన్నీళ్లు. ఇంకా హ్యూమన్ రిలేషన్స్‌కి నీళ్లొదల్లేదు వీళ్లు అనుకున్నాను.

"డాక్టరీ చేస్తున్నావని విన్నాను. అవునా?" అన్నారాయన.

అవునన్నట్టు తలూపాను.

"చాలా పెద్దవాడివయ్యావురా" అని, చనువుగా నా ముఖంలోకి చూశారు ఏమన్నా అనుకున్నానేమో ఆయన సంబోధనకి అన్నట్టు.

"ఇంటికెళ్లు బాబూ. మళ్లీ కలుద్దాం. నాలుగు రోజులుంటావు కదా" అంటూనే ముందుకి కదిలారు.

ఈయనెవరో నాకు తెలీదు. కానీ ఆయనకి అమ్మ తెలుసు. నా చరిత్రంతా తెలుసు. ఎందుకో చాలా సంతోషంగా అనిపించింది.

ఇరవై ఏళ్లుగా ఢిల్లీలో ఉంటున్న నేను ఏ కొద్దిమందికే తెలుసు. ఇరవై ఏళ్లుగా ఒక్కసారి కూడా ఈ ఊరు రాకపోయినా నేనెవరో తెలుసు, నాకు తెలీని ఈయనకు.

హుషారుగా ముందుకి నడిచాను.

దూరంగా కాళ్లకి బంధాలేసుకొని కల్లుకుండలూ, కత్తీ తగిలించుకొని వేగంగా తాడిచెట్టు ఎక్కుతున్న ఒక గీత కార్మికుడు..

మోరలెత్తి 'అంబా' అంటూ అడ్డదిడ్డంగా పరిగెత్తుతున్న కోడెదూడ 'అంబా' అన్నదాని అరుపు, 'నాన్నా! రారా' అని మా అమ్మ పిలుపులాగా ఉంది.

ఎందుకో ఒంటి మీది రోమాలు నిక్కబొడుచుకున్నాయ్.

"ముంజకాయలు తింటారా బాబూ!" అన్న పిలుపుకి ఆగాను. అప్పుడే తాడిచెట్టు నుండీ గెల దింపినట్టున్నాడు.

కొడవలీ, ముంజులూ పట్టుకొని నేనెవరో తెలీని నా సోదర భారతీయుడు ఆదరంగా అన్నా! పెడతాను, తినమని అడుగుతున్నాడు.

నాకు పెట్టటం వలన అతనికేం వస్తుంది? తింటానని తలూపాను.

గబగబా కొడవలితో ఒక లేతముంజ కాయ కొట్టి చేతికందించాడు.

ఎలా తినాలా అని తికమక పడుతుంటే, ఎలా తినాలో చెప్పాడు.

అతను ఇంకా ముంజులు కొట్టబోతుంటే, ఇక చాలని అతన్ని వారించి ఇరవై రూపాయల కాగితం అతనికి అందించాను.

తెల్లబోయి నా వంక చూసి "వద్దు బాబూ" చెట్టు ఇచ్చిన ఈ కాయలకి ధర కట్టద్దు అంటూ నిరాకరించాడు.

ఇచ్చిన డబ్బుల్ని వద్దనే పెద్ద మనసు..

మళ్లీ ఎందుకో అమ్మ గుర్తొచ్చింది. నాన్న గది ఫోటోఫ్రేమ్‌లో నవ్వుతున్న అమ్మ ముఖం.

'ఇదే మా పల్లె గొప్పతనంరా! అర్థమయిందా?' అంటున్న ఫీలింగ్.

డబ్బులు తీసుకోకపోయినా, ఏ ఊరు బాబూ తమది? ఎవరింటికెడుతున్నారు? అని క్యూరియాసిటీతో ప్రశ్నించటం మాత్రం మర్చిపోలేదు అతను. ఇదీ పల్లె ప్రత్యేకతే అనుకుంటా.

ముందుకి కదిలాను అతనికి సమాధానం చెప్పి.

ఇరవై సంవత్సరాల క్రితం నన్ను తీసుకొని ఈ ఊరు వదిలారు నాన్న. అప్పటి నుండీ ఇప్పటిదాకా నేనే ఆయన లోకం.

ఆ రోజుల్లోనే అమ్మా, నాన్నలది పెద్దలు ఆమోదించిన ప్రేమ వివాహం. దూరపుబంధుత్వం ఉన్న అమ్మా, నాన్నలది ఈ ఊరే.

వాళ్ల పెళ్లయిన దగ్గర నుండీ కలసి గడిపిన ఎనిమిది సంవత్సరాలూ చాలా అపురూపమైనవంటారు నాన్న.

నాన్న కూడా నాలాగానే డాక్టరు. ఈ ఊళ్లోనే ప్రాక్టీస్ పెట్టుకున్నారు.

పుట్టిన ఊరి బిగి కౌగిలిలో మెత్తగా సాగిపోతున్న వారి జీవితంలో అపస్వరం అమ్మ అకాల మరణం.

## ఆయన కోసం..!

**ఐశ్వర్యారాయ్ తన భర్తతోనే కాకుండా, ఇతర హీరోలతో కూడా నటిస్తూ వస్తోందింత కాలం. ఇకపై అభిషేక్‌తో అయితేనే నటిస్తాను అనే కండిషన్ పెట్టబోతోందని ఆమె సన్నిహితుల ద్వారా వార్త గుప్పుమంది. ఇదే నిజమైతే ఇక ఐశ్వర్యకి ఆఫర్లు తగ్గడం ఖాయం. ఐష్‌తో పోలిస్తే అభిషేక్‌కి అంతగా కమర్షియల్ డిమాండ్ లేదని ఎవరైనా చెప్తారు. ఇలా తనతో సినిమాలు తీయాలనుకునే వారితో బలవంతంగా అభిషేక్‌ని కూడా నటింపచేయాలనుకుంటోందేమో ఐష్. గతంలో ఇలాంటి కండిషన్లు పెట్టిన భాగ్యశ్రీ లాంటి తారలు దెబ్బతిన్న సంగతి ఆమె గుర్తు చేసుకోవాలి!**



ఏ అనారోగ్యం లేకుండా అంత సడన్‌గా అమ్మ పోవటం అందరికీ పెద్ద షాక్. అమ్మ పోయిన పదిహేను రోజులకే అమ్మ లేని ఇంట్లో ఉండలేక నన్ను తీసుకొని ఊరు వదిలేశారు నాన్న. ఆ వదలటం వదలటం ఈ రోజు దాకా మళ్లీ ఈ గడ్డ మీద అడుగు పెట్టలేదు మేము.

నాలుగు రోజుల క్రితం, అమ్మ తిరిగిన పల్లెకి ఒక్కసారి వెళదాం అని నాన్నని అడిగేదాకా, ఈ ఊరి గురించి ఇరవై ఏళ్లుగా మేము పెద్దగా తలుచుకోలేదనే చెప్పాలి.

నాన్నకి మళ్లీ ఈ ఊళ్లో అడుగుపెట్టడం ఇష్టం లేదు. "నువ్వెళ్లొచ్చి వివరాలు నాకు చెప్పరా! మళ్లీ ఆ జ్ఞాపకాల్లో మిగతా జీవితం గడిపేస్తాను" అన్నారు నాన్న.

బస్ దిగిన దగ్గర్నించీ ఇంటి దాకా ఎలా వెళ్లాలో చాలా వివరంగా, మరీమరీ నాన్న చెప్పటంతో ఊళ్లోనే ఉంటున్న అత్తావాళ్లకి కబురు వెయ్యకుండానే డైరెక్ట్‌గా వచ్చేశాను.

ఆలోచనలు తెగక ముందే ఊళ్లోకి వచ్చేశాను.

గత వైభవానికి చిహ్నాల్లాగా మట్టిరోడ్డుకు ఇరువైపులా పాతకాలం నాటి పెంకుటిళ్లు, ఇంటింటికీ పెద్ద గద్దెల్లాగా వీధి అరుగులు. గోడల మీద మొలిచిన పిచ్చిమొక్కలతో శిథిలావస్థలో ఉన్నాయి కొన్నిళ్లు. పెరిగిన పిచ్చిమొక్కలే చెపుతున్నాయి ఇల్లుగల వాళ్లు ఇళ్లకి తాళాలేసి పట్నంలో స్థిరపడ్డారని.

ఆ వీధి దాటి చెరువుగట్టు మీదుగా ముందుకి సాగాను.

చెరువులో బట్టలుతుకుతున్న చాకళ్లు ఒక్క క్షణం ఉతకటం ఆపి నా వంక తేరిపారా చూశారు 'ఈ పొలుకారే పట్నం బాబు ఎవరా' అన్నట్టు.

వాళ్లని క్రీగంటిగా గమనిస్తూ, నాలో నేను నవ్వుకుంటూ ముందుకి సాగాను.

సందు మలుపు దాటి కుడివైపు వెళ్లగానే అమ్మవారి గుడిగంటల చిరుమువ్వల మరుసవ్వడి. మిట్టమధ్యాహ్నం నిండు ముత్తయిదువ ఆదరంగా ఇంటింటికీ వెళ్లి 'అమ్మా! అందరూ బాగున్నారా? సుఖంగా ఉండండి తల్లీ' అని పరామర్శిస్తున్నట్టుగా ఉంది ఆ గుడి గంటల చిరుసవ్వడి నా చెవులకు.

నాన్న చెప్పిన ప్రకారం గుడి నుండీ ఎడమ వైపు ఆరో ఇల్లే అత్తావాళ్లది.

పాతాకొత్తా అని చెప్పలేని పెంటుటిల్లు. దగ్గరగా వేసి ఉన్న వీధిగేటు మోత రాకుండా మెల్లగా తెరచి లోపలికి అడుగు పెట్టాను.

ఇంట్లోకి దారితీస్తూ పెద్ద బాట. బాటకి ఇరువైపులా రంగురంగుల పూలమొక్కలు. పూల మీద వాలి కుదురు లేనట్టుగా మళ్లీ ఎగురుతున్న వన్నెచిన్నెల సీతాకోకచిలుకలు. కొబ్బరి పిందెల్ని కొరుకుతూ గమ్మత్తుగా అరుస్తున్న ఉడుత పిల్లలు. దూరంగా పొట్ల పందిర. పొట్ల పిందెల చివర ఎవరో చిన్న రాళ్లని వేళ్లాడకట్టారు. బహుశ కాయలు వంకర తిరక్కుండా కావచ్చు. వంగచెట్ల నిండా విరగకాసిన వంకాయలు, గుమ్మడిలాగా ఉన్న టమాటా చెట్ల నిండా టమాటాలు.

చెప్పలేని ఆనందంతో వాటిని అలా చూస్తూ నుంచుండిపోయాను. ఇంతలో ఇంట్లోంచి కొద్దిగా నాన్న పోలికలో ఉన్న ఒకావిడ బయటికి వచ్చింది.

"ఎవరు బాబూ నువ్వు? యాకంగా ఇంట్లోకే వచ్చేస్తున్నావ్?" అంది కొంచెం గట్టిగా. ఈవిడ కూడా నాన్నలాగానే అనుకుంటా పలుకు కరుకు, మనసు వెన్న.

ఆవిడ మాటల్ని పెద్ద పట్టించుకోనట్టు వెళ్లి అరుగుమీద కూర్చొని "చెప్పుకోండి చూద్దాం" అన్నాను.

నా చొరవకి తల్లైబోయినట్టుంది. గుడ్లప్పగించి నా వంకే చూస్తోంది.

"ఎవరితోనే మాట్లాడుతున్నావ్" అంటూ బయటికి వచ్చారు వయసులో అత్తకన్నా కొంచెం పెద్దగా కనిపిస్తున్న ఒకాయన. చూడంగానే చాలా మంచివాడిలాగా అనిపించారాయన.

"ఎవరమ్మా వచ్చింది" అంటూ ఇంట్లోంచే ఒక అమ్మాయి ప్రశ్న.


ఇంకా వీళ్లందర్నీ సస్పెన్స్‌లో పెడితే నలుగుర్నీ పిల్చి పంచాయతీ పెట్టేటట్టున్నారని భయంవేసి..నవ్వుతూ.. "ఢిల్లీ నుండి వస్తున్నానత్తా. మీ అన్నయ్య ప్రసాదరావ్ గారి అబ్బాయిని" అన్నాను.

"ప్రసాదం కొడుకువా?" అన్నారు ఆశ్చర్యంగా నోరు తెరచి ఆయన.

"మా అన్న కొడుకువి అంటే నా మేనల్లుడివా నువ్వు!" అంది అత్త మెత్తగా.. వాత్సల్యంగా..

ఆశ్చర్యం ఆయన కళ్ల నుండీ కన్నీళ్లు..

ఆవిడ కళ్లల్లో జిలుగువెలుగులు కనిపించాయి.



ఇద్దరూ ఒక్క అంగలో నా దగ్గరకు వచ్చారు అక్కున చేర్చుకోవాలని.

మెరుపులా పక్కకి తప్పుకున్నాను. దాని ఫలితం...

వీధి అరుగుమీద అత్తయ్యా మామయ్యా నా ముందు ఒకరినొకరు పెనవేసుకున్నారు. క్షణంలో సిగ్గుపడుతూ దూరం జరిగారు.

"ఇవేం పనులత్తా.. చిన్న పిల్లాడి ముందు.. అదీ పట్టపగలు.. అవ్వా! సరసానికి కూడా వయసూ, సమయం ఉంటుంది" అని నోటిమీద వేలేసుకున్నాను నాటకీయంగా.

"నోరు ముయ్యరా! చేసిందంతా చేసి మాటలు బాగా నేర్చావ్" అంటూ మురిపెంగా అంది. ఇంకా ఆశ్చర్యం నుండీ తేరుకోలేదు అత్త. ఆరేళ్ల వయసులో చూసిన మేనల్లుడ్ని మళ్లీ ఇంతకాలం తర్వాత.. ఆనందం పట్టలేనట్టుంది ఆమె ముఖం.

"మా అన్నయ్య ఎలా ఉన్నారు బాబూ!"

"బానే ఉన్నారత్తాయ్యా" అని చెపుతుండగా...

బయటికి వచ్చింది అత్తకూతురు రాజీ. మేము ఊరు వదలినప్పుడు దీనికి బహుశ అయిదేళ్లుంటాయేమో. ఇప్పుడు పెద్దదయింది ఆడపిల్లా, అరటిచెట్టూ కళ్ల ముందే ఎదుగుతాయంటారు. వెన్నెల్లా. వెలిగిపోతూ, పుచ్చపువ్వులా నిండుగా నవ్వుతున్న రాజీ.

నాన్న అంటుంటారు.. రాజీ అచ్చం మా అమ్మలాగా ఉంటుందని.

"ఏమిటో వాకిట్లో నుంచోబెట్టే మాట్లాడుతున్నాను. కాళ్లు కడుక్కొని లోపలకిరా నాన్నా" అంటూ... "ఎప్పుడనగా అన్నం తిన్నావో తొందరగా వంట చేసేస్తాను" అని "అమ్మా రాజీ! బావకి కాళ్లు కడుక్కోటానికి నీళ్లిచ్చి, అదే చేత్తో నాలుగు వంకాయలు, ఒక పొట్లకాయ తుంచుకు వస్తావా" అని కూతురికి పని పురమాయించింది.

నీళ్లచెంబు నా చేతికి అందిస్తూ "బావా! పుల్లెక్కడ పడేశావో చెప్పవా!" అంది రాజీ.

నా జ్ఞాపకాల పొరల్లో ఏదో కదలిక.

## తెలుగుపై 'శ్రద్ధ'

ఇప్పుడిప్పుడే తెలుగులో గుర్తింపుని తెచ్చుకుంటున్న శ్రద్ధాదాస్ వీలైనంత త్వరగా తెలుగులో చక్కగా మాట్లాడేందుకు ప్రయత్నిస్తోందిట. ఇటీవల 'అధినేత' ఆడియో రిలీజ్ ఫంక్షన్‌లో ఆమె ఓ పాటని చక్కగా పాడి అందర్నీ ఆకట్టుకుంది. దీంతో ఆమెకి తెలుగు భాషపై ఎంత ఆసక్తి వుందో అర్థమవుతుంది అని అంతా భావిస్తున్నారు. తెలుగు మాతృభాష అయిన తారలెంతోమంది తెలుగు డైలాగులు సరిగ్గా పలకలేక డబ్బింగ్‌లు చెప్పించుకుంటుంటే నాన్‌తెలుగూ అమ్మాయి తెలుగు నేర్చుకోవాలనుకోవడం విశేషమేగా!

ఇరవై ఏళ్ల క్రితం నేనూ, రాజీ ఆడిన ఆటలు ఇంకా దీనికి గుర్తున్నాయన్నమాట.

"నీ నెత్తిమీద ఏదో ఉంది" అన్నాను కంగారుగా.

"ఏముందేమిటి?" అని భయంగా తలమీద చెయ్యి పెట్టి దులుపుకుంది.

"పుల్లుందేమో!" అని నవ్వుతూ ఇంట్లోకి దారి తీస్తూ వెనక్కి తిరిగి చూశాను. రాజీ ఉక్రోషంగా నా వంక చూస్తూ ముందుకి పడ్డ పాములాంటి జడని వెనక్కి వేసుకుంటూ వేగంగా పెరట్లోకి వెళ్లింది.

అత్త వంటింట్లో వంట చేస్తుంటే వెళ్లి గుమ్మం మీద కూర్చోబోయాను.

"మండిగం మీద కూర్చోకూడదు నాన్నా! దీని మీద కూర్చో" అంటూ ఒక పీట వాల్చింది. మా అమ్మ బ్రతికుంటే ఈ వయసులోనే ఉండేదేమో!

అత్త ఏవేవో కబుర్లు చెపుతూ నాకు తెలీని విషయాలెన్నో చెపుతూ... మధ్యమధ్య మా వివరాలు తెలుసుకుంటూ గబగబా వంట చేస్తోంది.

కమ్మని వంటకాలు ఆకలిని మరింత పెంచుతున్నాయ్.

నూతిగట్టు మీద సబ్బు పెట్టి, పెట్టి, చేతికి తువాలు అందించి తొందరగా స్నానం చేసి రమ్మన్నారు మామయ్య.

నేను స్నానం చేస్తుంటే నూతి గట్టు మీద కూర్చుని నాన్న వివరాలు చాలా ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు మామయ్య.

నాన్న ఈ ఊళ్లో ప్రాక్టీస్ చేసే రోజుల్లో వాళ్లిద్దరికీ చాలా మంచి దోస్తీ ఉండేదట.

అత్త రుచికరమైన భోజనాన్ని, ఆత్మీయత కలిపి వడ్డిస్తుంటే కొంచెం ఎక్కువే తినేశాను.

బాగా అలసిపోవటంతో కళ్లమీద నిద్ర ముంచుకొచ్చింది. మెలకువ వచ్చేసరికి చీకటి పడిపోయింది.

పక్క గదిలోంచి అత్త గొంతు వినిపిస్తోంది.

"ఇంతకాలం తర్వాత వీడు వచ్చాడు. అసలు నేను గుర్తే పట్టలేకపోయాను" అంటోంది.

"కుర్రాడు బాగున్నాడు. డాక్టర్ కూడా. మన రాజీని చేసుకుంటాడేమో! దూరం అయిన బంధుత్వం మళ్లీ కలుస్తుంది" మామయ్య గొంతు.

"ఊరుకో నాన్నా! ఎప్పుడూ నా పెళ్లి గోలే. బావ ఎక్కడో ఢిల్లీలో పుట్టి పెరిగాడు. ఏ డాక్టర్‌నో చూసుకుంటాడు కానీ నాలాంటి పల్లెటూరి పిల్లని ఎందుకు చేసుకుంటాడు. అలాంటి ఆశలు పెట్టుకొని బావని ఇరకాటంలో పెట్టొద్దు. నాలుగు రోజులు సరదాగా గడిపి వెళ్లనివ్వండి. ఇంతకాలం తర్వాత మనింటికొచ్చాడు. మనకి తగ్గ గంతకి తగ్గ బొంతని ఎక్కడో దేవుడు పుట్టించే ఉంటాడులే. కంగారేమీ అక్కర్లేదు" అని కమాండింగ్‌గా రాజీ గొంతు.

ఇంతవరకూ లేని కొత్త ఆలోచన.. రాజీతో నా పెళ్లి.. ఊహే గమ్మత్తుగా ఉంది.

ఇక్కడికి రావటానికి ముందు ఢిల్లీలో జరిగిన రెండు సంఘటనలు గుర్తుకొచ్చాయి.

☆ ☆ ☆

ఇంట్లో అడుగు పెడుతూనే రుసరుసలాడుతూ ఎదురొచ్చిందో ఇరవై ఏళ్ల అమ్మాయి.

కన్సల్టింగ్ రూం నుండీ నాన్న అరుపులు వినిపిస్తున్నాయి.

"ఏమయింది నాన్నా" అంటూ ప్రశ్నించాను.

మళ్లీ మామూలు విషయమే.

ఏదో కాల్‌సెంటర్లో పనిచేస్తోందిట. యాక్సిడెంటల్ ప్రెగ్నెన్సీ అని చాలా క్యాజువల్‌గా చెప్పి, ఎబార్షన్ చెయ్యమని అడుగుతోంది. పదివేల దాకా ఫీజ్ ఇవ్వడానికి కూడా సిద్ధం అని చెప్పటంతో నాన్న కోపం తారాస్థాయికి చేరుకుని 'గెటవుట్' అన్నారట. అందుకే ఆమె రుసరుసలూ, నాన్న చిటపటలూ..

పల్చపడిపోతోన్న హ్యూమన్ రిలేషన్స్. కాల్‌సెంటర్ కల్చర్ మన కల్చరల్ వాల్యూస్‌ని దారుణంగా దెబ్బతీస్తోంది. కల్చర్ ఛేంజ్‌కి అలవాటు పడలేని వెర్రి మనసుల వ్యథ..



రెండు రోజుల క్రితం హాస్పిటల్ నుంచి వస్తుంటే...

దాదాపు ఇదే వయసు అమ్మాయి లిఫ్ట్ అడిగింది. మనసు జాగ్రత్త అని హెచ్చరిస్తున్నా అయ్యో! పాపం అని బైక్ ఆపి ఎక్కమన్నాను.

"డోలాకువా దాకా దింపండి ప్లీజ్" అంది.

నేను కూడా అదే రూట్లో వెళ్లాల్సి ఉండటంతో సరే ఎక్కమన్నాను.

మాటామాటా కలిపింది. తను ఏదో కాల్‌సెంటర్లో పనిచేస్తున్నానంది. బైక్ కుదుపులు ఏమీ లేకపోయినా భుజం మీద చెయ్యేసి, సర్దుకుకూర్చున్నట్టుగా ముందుకి జరిగి గుండెలతో నొక్కటం మొదలుపెట్టింది.

వ్యూ మిర్రర్‌లో ఆమె ముఖం చూశాను.

పాలుకారే ముఖంతో చిన్న పిల్ల.. కళ్లల్లో పసితనం వదలనట్టుంది.

జీన్స్ ప్యాంట్, ఏదో బొమ్మల టీషర్ట్ శరీరానికి అతుక్కున్నట్టుగా గట్టిగా ఉన్నాయ్.

బైక్ ఆపి దిగమన్నాను.

"వాటీజ్ దేర్ ఇనిట్" అంది చాలా క్యాజువల్‌గా తను చేసిన పనికి. ఇలా కొంచెం ఎక్స్ట్రాలు పోకపోతే ఎవరూ లిఫ్ట్ ఇవ్వరంది.

## నమిత కెరీర్!

తెలుగులో 'బిల్లా'తో రీఎంట్రీ చేసిన బొద్దుగుమ్మ నమితకి ఆ సినిమా నిరాశనే మిగిల్చింది. ఇందులో నమిత తన పాత్రకి తనే డబ్బింగ్ కూడా చెప్పుకుంది. ఇక నమిత ఆశలన్నీ 'జగన్మోహిని' మీదే. అప్పుడెప్పుడో ముప్పయ్యేళ్ల క్రితం వచ్చిన 'జగన్మోహిని'కి రీమేక్ అయిన ఈ కొత్త జగన్మోహిని తెలుగులో తన కెరీర్‌ని తప్పకుండా మలుపు తిప్పుతుందనే గట్టి నమ్మకంతో వుందిట నమిత. జయమాలిని చేసిన టైటిల్ రోల్‌ని నమిత పోషిస్తోంది. ఏదేమైనా కాస్తో కూస్తో 'స్లిమ్' అయితేగానీ నమిత కెరీర్ ముందుకెళ్లడం కష్టమే అనేది సినీజనాల ఉవాచ.

ఈ రెండు ఇన్సిడెంట్స్ మనసును ఎందుకో కదిలించాయి. ఎందుకో అమ్మ గుర్తు రావటం మొదలుపెట్టింది. అమ్మ తిరిగిన ఊరు వెళ్లాలనే కోరిక ఒక్కసారిగా ఎక్కువవ్వటంతో ఎలాగో నాన్నని కన్విన్స్ చేసి ఈ ఊరు ట్రిప్ ప్లాన్ చేసుకున్నాను. జరిగిన ఈ రెండు సంఘటనలకీ, ఊరు రావటానికీ పెద్దగా సంబంధం లేకపోయినా ఆ రెండు వెంటవెంటనే జరిగిపోయాయి.

☆☆☆

గతంలోంచి మళ్లీ వాస్తవంలోకి వచ్చాను.

మామయ్య మనసులో తన కూతుర్ని నేను చేసుకుంటే బాగుంటుందనే ఆలోచన ఉంది.

రాజీ!

చిన్నప్పుడు దాని గుప్పెట్లో ఇసుకపోసి, అందులో ఒక పుల్ల గుచ్చి, దాని కళ్లు నా చేతులతో గట్టిగా మూసి ఏ దొడ్లోనో, వీధిలోనో ఇసుకను పోయించి కళ్లు అలాగే మూసి దూరంగా తీస్కొచ్చి వదిలేవాడిని. పుల్ల వెతికి పట్టుకోవాలి. చిన్నప్పుడు అది మా ఆట.

ఆ రోజు కూడా అలాగే ఆడుకుంటున్నాం. రాజీకి ఎంతకీ పుల్ల దొరకలేదు. ఏడ్పునంత పనిచేసింది. ఎంత బ్రతిమిలాడినా చెప్పకపోవటంతో, ఉక్రోషం పట్టలేక గుప్పెడు మట్టి తీసి నా ముఖం మీదికి విసిరింది.

కళ్లల్లో ఇసుక పడటంతో అబ్బా! అని బాధగా కళ్లు మూసుకున్నాను. రాజీ బాగా కంగారు పడింది. దాని కళ్లల్లో కన్నీళ్లు. గౌను కొసతో వేడి ఆవిరి ఊది నా కళ్ల మీద పెడుతుండగా...

మా పెదపాలేరు ముత్యాలు, అమ్మ పోయిందనే వార్తని మోసుకొచ్చి, నన్ను వెంటనే ఇంటికి తీసుకెళ్లాడు.

అంతే... మళ్లీ రాజీని చూడటం ఈ రోజే ఆ తర్వాత.

అందుకే నన్ను చూడంగానే బావా! పుల్లెక్కడ అని అడిగింది ఈ రోజు.

ఢిల్లీలో ఆడతనం మరచిపోయిన ఎందరో ఆడవాళ్లని చూస్తూనే ఉన్నాను. వాళ్లందరి కంటే రాజీ...

అమ్మ పోలికలతో అందంగా ఉన్న రాజీ నా ఇల్లాలయితే...

నాన్న బాగా సంతోషిస్తారు చెల్లెలి కూతుర్ని చేసుకుంటే. నా కోసం జీవితంలో అన్నీ కోల్పోయిన నాన్నకి విలువైన ఈ బహుమతి ఇస్తే ఎలా ఉంటుంది?

నా దృష్టిలో ఇప్పటిదాకా ఎవరూ లేరు.

ఆడపిల్లలకి నేను ఆమడ దూరంలో ఉంటాను.

అందుకనే రాజీ విషయంలో తుది నిర్ణయం తీసుకోవటానికి అంత సమయం పట్టలేదు.

మరుక్షణం లేచి పక్కగదిలోకి వెళ్లాను.

నన్ను చూసి అత్తా, మామయ్య, రాజీ తెల్లబోయారు.

"అత్తా! తెల్లారంగానే నేనెళ్లిపోతాను. అసలు ఇప్పటికిప్పుడే వెళ్లిపోవాలని ఉంది. కానీ ఈ పల్లెటూర్లో బస్సులు ఇంత రాత్రి ఉండవని బలవంతంగా ఆగాల్సి వస్తోంది" అన్నాను కొంచెం విసురుగా.

ముగ్గురూ నా వంక కొంచెం ఇబ్బందిగా, గిల్టీగా చూశారు.

ఎలాగో గొంతు పెగల్చుకొని అత్త అంది "బుద్ధి లేకుండా, ఆలోచన లేకుండా మాట్లాడిన మా మాటలు విన్నావురా?" ఆమె కొరకరా మామయ్య వంక చూసింది. ఆయన తప్పు చేసినట్టు తలదించుకున్నాడు.

"ఎందుకు వినడు. మన గొంతుకలేమన్నా చిన్నవా? నన్ను చేసుకోమని ఎక్కడ బలవంతం చేస్తారోనని, నాలుగు రోజులుండాల్సిన బావ ఇప్పుడే ప్రయాణం కట్టేశాడు" అంది రాజీ రోషంగా.

బాపూబొమ్మలాంటి ఆమె ముఖంలో రోషం. గొంతులో స్వాభిమానం.

దాన్ని అలా చూసి ఆగలేక అనేశాను.

"అలాంటిదేం లేదు. కతికితే అతకదంటారు నాన్న"

"ఏమిటీ?" అన్నారు ముగ్గురూ ఒకేసారి.

"మీరు కరెక్ట్‌గానే విన్నారు. ఒంటరి చిన్నపిల్లాడ్ని చేసి మళ్లీ మళ్లీ చెప్పించాలని చూడకండి" అనేసి అక్కడి నుండీ వెళ్లిపోతూ నాన్నగారి విజిటింగ్ కార్డ్ అత్త చేతికిచ్చాను.

"రేపు నేను వెళ్లంగానే ఈ నెంబర్‌కి ఫోన్ చేసి అన్ని విషయాలూ వివరంగా నాన్నతో డిస్కస్ చెయ్. నాన్న చెల్లెలి మాట కాదనరు" అని చెప్పాను.

రాత్రి ఎంత పడుకోవాలని చూసినా ఎవరికీ కంటి మీద కునుకు లేదు. 'కతికితే అతకదు' అని అనుమానం పెట్టటంతో ఆ పూట అత్త ఇంట్లో వండిన ఒక్క మెతుకు కూడా పెట్టలేదు. పాలేరు చేత కాంతయ్య పునుగులు తెప్పించి పెట్టింది. అవి ఎప్పుడో అరిగిపోయి ఆకలి కూడా దంచేస్తోంది.

అర్ధరాత్రి అందరూ నిద్రపోయారని నిర్ధారణ చేసుకొని రాజీ నా మంచం దగ్గరకొచ్చి "బావా!" అంటూ నిద్ర లేపింది.

లేచి మంచం మీద కూర్చున్నాను.

"బావా! నన్ను పెళ్లి చేసుకుంటానన్న మాట నిజమే కదా! జోక్ చెయ్యటం లేదు కదా! అది జోకే అయితే ఇప్పుడే గుట్టుచప్పుడు కాకుండా వెళ్లిపో. తెల్లారి లేచి అది జోక్ అని చెపితే మూడు గుండెలు ఆగిపోతాయి" అంది.

రాజీ కళ్లల్లో సన్నటి కన్నీటి పొర.. కళ్లల్లో ఏదో అపనమ్మకం.

స్నేహపూర్వకంగా ఆమె చేతిలో చెయ్యేసి చూపులో చూపు కలిపి కళ్లల్లో కళ్లు కలిపి ఆమెని చూస్తుంటే... ఎప్పుడో చదివిన తెలుగు పద్యం గుర్తుకొచ్చింది.

'మోమున మోము చేర్చి నిను ముద్దిడు కోరికలేదు
నీదు వక్షోమ్మృదుశయ్యలపైన శిరసున్ గడవాల్చి
వ్రేలును మల్లికాధామ సువాసనా మధురిమల్
కడతేర్చగ ఆశలేదు...'

తెలుగు సాహిత్యం మీద నాన్న కలిగించిన ఇంట్రెస్ట్.

నా నిర్ణయంలో ఎటువంటి మార్పూ ఉండదనీ, అన్నీ జాగ్రత్తగా ఆలోచించే నిర్ణయించానని రాజీకి చెప్పాను. మా మాటలకి అత్తా, మామయ్య కూడా లేచి కూర్చున్నారు. తెల్లారేదాకా ఇక కబుర్లే కబుర్లు.

ఇక నేను వెళ్లాల్సిన సమయం వచ్చేసింది. పల్లెనీ, రాజీనీ వదల్లేక వదల్లేక వదిలి వెళ్లటానికి సిద్ధం అయ్యాను.

నేను సందు కూడా పూర్తిగా తిరక్కుండానే "అన్నయ్యా! ఎలా ఉన్నావ్‌రా" అంటూ అత్త గొంతు గాలిలో తేలుతూ వినిపించింది పల్లెగాలి పెళ్లి సన్నాయి పాడినట్టుగా.. రెల్లుపూవు పెళ్లిమంత్రాలు చదివినట్టుగా...

☆

